RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక

నువ్వు పక్కనున్నప్పుడు
ఇచ్చే విలువ కంటే..
నువ్వు లేనప్పుడు
నీకు ఇచ్చే విలువే అవతలి వాళ్ల
మనసులో నీ స్థానం ఏంటో
తెలియజేస్తుంది

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 269
ఆదివారం, సెప్టెంబర్ 13, 2026 , పేజీలు - 4 వెల : 2/-

## 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే

# తెలంగాణ లక్ష్యం

- హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు
- దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి
- హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి



**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (+జజ) ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు.ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## కేసీఆర్ హయాంలోని భూ అక్రమాలను

# అసెంబ్లీ ముందు ఉంచుతాం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12** :కేసీఆర్ హయాంలో తెలంగాణలో పేదలకు అందాల్సిన ఆస్తుల పై కన్నేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆ భూములను కొల్లగొట్టేందుకు మాస్టర్ స్కెచ్ వేశారని పేర్కొన్నారు. 22ఏ సంబంధిత భూముల సమస్యలపై అసెంబ్లీలో లఘు చర్చను మంత్రి పొంగులేటి ప్రారంభించారు.ఆ మాస్టర్ స్కెచ్‌లో భాగమే ధరణిని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ధరణిని తీసుకొచ్చారని అన్నారు. నలుగురు వ్యక్తులు నాలుగు గోడల మధ్య అర్ధరాత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ధరణి వచ్చాక పేదలు అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టారు..ధరణి నిర్వహణ కాంట్రాక్ట్‌ను కూడా తమకు అనుకూలమైన సంస్థకే ఇచ్చారని మంత్రి పొంగులేటి చెప్పారు. తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని ఆరోపించారు. తాకట్టు పెట్టిన భూములను మరో సంస్థకు బదిలీ చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భూములను సొంత ఆస్తుల్లా ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు చేశారని అన్నారు. కేసీఆర్ హయాంలోని అక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా తాము సభ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులు.. మాజీ మంత్రులు.. ఎమ్మెల్యేలు కూడా ధరణిపై మాట్లాడారని చెప్పారు.మంచి చేయాలని.. కానీ విషం చిమ్మే సంస్కృతి సరికాదని పేర్కొన్నారు.

## తెలంగాణ భవన్‌లో

# 'నమూనా అసెంబ్లీ'



**హైదరాబాద్:**కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు.ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానిం చారు.కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించా రు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు.

### లైంగిక వేధింపుల

# ఆరోపణలు

**'ఢీ-10' డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్**



తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 'ఢీ-10' డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అన్ని సౌకర్యాలు అందిస్తాం, భక్తితో

# గణనాథుడిని పూజిద్దాం

- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు.



**హైదరాబాద్:**
గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్?లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్?లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్?కు అందించాలని సూచించారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

## కొండా సురేఖకు

# ఢిల్లీ నుంచి పిలుపు



**హైదరాబాద్**మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం.మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపైమరింతస్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఒకప్పుడు 'బలహీనత' ఇప్పుడు

# 'వృద్ధి ఇంజిన్'

**న్యూ ఢిల్లీ :**
ఒకప్పుడు 'బలహీనమైన బంధం'గా విమర్శలు ఎదుర్కొన్న భారత్, నేడు అదే కూటమికి 'వృద్ధి ఇంజిన్'గా మారింది. 2012లో ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగినప్పుడు, అసలు ఈ వర్ధమాన దేశాల కూటమిలో భారత్‌కు స్థానం ఉందా? అనే ప్రశ్నలు తలెత్తాయి. కానీ పద్నాలుగేళ్ల తర్వాత 2026లో విస్తరించిన కూట మికి భారత్ మరోసారి ఆతిథ్యం ఇస్తున్న వేళ, పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు బ్రిక్స్ భవిష్యత్తును నిర్దేశించే కీలక శక్తిగా భారత్ అవతరించింది.2012 నాటి పరిస్థితులను పరిశీలిస్తే, భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంది. 2012-13లో వృద్ధి రేటు 5 శాతం కంటే దిగువకు పడిపోయింది, ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయిలో ఉంది, రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.




అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ 'స్టాండర్డ్ & పూర్స్' అయితే, భారత్ తన 'ఇన్వెస్ట్‌మెంట్-గ్రేడ్' సార్వభౌమ రేటింగ్‌ను కోల్పోయే తొలి బ్రిక్ దేశంగా మారవచ్చని హెచ్చరించింది. 'బ్రిక్' అనే పదాన్ని సృష్టించిన ప్రముఖ ఆర్థికవేత్త జిమ్ ఓ'నీల్ సైతం, ఆ నాడు బ్రిక్ దేశాల్లో పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణీయం కాని దేశంగా పేర్కొన్నారు. కొందరైతే భారత్ స్థానంలో ఇండోనేషియాను చేర్చాలనే వాదనలు కూడా వినిపించారు.

## ఆరోగ్య రంగంలో పెను మార్పులకు

# డబుల్ ఇంజిన్ సర్కారే కారణం

**అమరావతి** :రాష్ట్రంలో అత్యవసర వైద్యానికి మరింత బలం చేకూర్చేలా నేటి నుంచి క్రిటికల్ కేర్ యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడలో 249 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 9 క్రిటికల్ కేర్ యూనిట్లు, 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు.అంతకుముందు ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం విజయవాడ పాత ఆసుపత్రి వద్ద క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. 9 సీసీ బ్లాకులు, 12 పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.పేద, మధ్యతరగతి వర్గాలకు తగ్గనున్న ఖర్చు : ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి



వచ్చాయి. పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా ఖర్చు తగ్గుతుంది. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్ఠం చేస్తాం. సంజీవని ప్రాజెక్టు గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌గా మారబోతోంది. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలామందికి ప్రయోజనం చేకూరుతుంది. నడ్డా నాయకత్వంలో ఆరోగ్య రంగంలో కొత్త ఆవిష్కరణలు వచ్చాయి. ఆరోగ్య రంగంలో పెను మార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం. అర్హులైన వారికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా. 2047 నాటికి ప్రపంచంలోనే మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# సొంత నిధులతో ప్రజాసేవ ఆదర్శనీయం
# ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- రూ. 25 లక్షల సొంత నిధులతో బీరంగూడ రాఘవేంద్ర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం
- ఆంజనేయ స్వామి ఆలయ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్, నందారం నరసింహ గౌడ్
- మాజీ వైస్ చైర్మన్ నందారం ఔదార్యాన్ని కొనియాడిన కాలనీవాసులు



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 12: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతూ, సమాజ హితం కోసం సొంత నిధులు వెచ్చించే నాయకులు సమాజానికి ఆదర్శప్రాయులని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే 300 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ తన సొంత నిధులు రూ. 25 లక్షలు కేటాయించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నందారం నరసింహ గౌడ్‌తో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి సొంత జేబు నుంచి రూ. 25 లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మించడం ఆషామాషీ వ్యవహారం కాదని కొనియాడారు. నందారం నరసింహ గౌడ్ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం ముందుంటారని ప్రశంసించారు. కేవలం రోడ్ల నిర్మాణమే కాకుండా, కాలనీలలో వినాయక మండపాల షెడ్ల నిర్మాణం మొదలుకొని పలు ప్రజాహిత, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతుగా భారీ ఆర్థిక సహకారాన్ని అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. నందారం నరసిం హ గౌడ్, వారి కుటుంబ సభ్యులపై భగవ ంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మనస్ఫూర్తిగా ఆకా ంక్షించారు. అనంతరం రాఘవేంద్ర కాలనీ అధ్యక్షుడు మల్లేష్, కాలనీవాసులు మాట్లాడు తూ... తమ కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయ రోడ్డు అధ్వానంగా ఉండి భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విష యాన్ని నందారం నరసింహ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన ఏమాత్రం సంకోచి ంచకుండా రూ. 25 లక్షల సొంత నిధులతో 300 మీటర్ల సీసీ రోడ్డు వేయించేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషకం ాఁమన్నారు. అడిగిన వెంటనే స్పందించి రోడ్డు పనులను ప్రారంభించిన నరసింహ గౌడ్‌కు కాలనీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. తమ కాలనీ అభివృద్ధిపై ఇంతటి శ్రద్ధ కనబరుస్తున్న ఆయనకు, వారి కుటుంబ సభ్యులకు ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని కాలనీవాసులు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, కృష్ణ, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు బాల్ రాజ్, కొల్లూరు గోపాల్, ప్రమోద్ రెడ్డి, యూనిస్, నందారం రమేష్ గౌడ్, కొల్లూరు యాదగిరి, లింగం గౌడ్, దాసు యాదవ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శ్యామ్, రాఘవేంద్ర కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, ట్రెజరర్ గోపి, ప్రసాద్ రావు, శ్రీనివాస్ చారి, లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, రాఘవేంద్ర కాలనీ కమిటీ ప్రతినిధులు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## రూ. 6 లక్షల సొంత నిధులతో
## దేవాలయ షెడ్ నిర్మించిన ఎమ్మెల్యే



- షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహి పాల్ రెడ్డి, మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్..
- ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి హామీ

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 12: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి మరోమారు తన దైవభక్తిని చాటుకున్నారు. ప్రజలలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు తన వంతుగా నిరంతరం కృషి చేస్తూ, సొంత నిధులతో నూతన దేవాలయాలు, మౌలిక సదుపాయాలు నిర్మిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాజాగా.. బీరంగూడ పరిధిలోని మండే మార్కెట్ శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం ఆవరణలో రూ. 6 లక్షల సొంత నిధులతో నిర్మించిన నూతన షెడ్డును శనివారం ఉదయం అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పిస్తూ ఎంతో సౌకర్యంగా ఉండేలా ఈ షెడ్డును నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే ఆలయ అభివృద్ధిలో భాగంగా త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దశలవారీగా పనులు చేపట్టి ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గతంలోనూ ఆలయ సాలహారం నిర్మాణానికి రూ. 2 లక్షల నిధులు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుపుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమంతో పాటు భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులు కేటాయిస్తూ నిరంతరం సేవాభావంతో ముందుకెళ్తున్న ఎమ్మెల్యే కి ఆలయ కమిటీ, స్థానిక ప్రజల తరఫున వారు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, బాల్ రాజ్, గోపాల్, ప్రమోద్ రెడ్డి, దాస్ యాదవ్, కొల్లూరు యాదగిరి, లింగం గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శ్యామ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేగుంట మండల కేంద్రంలో
# సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ

- రైతాంగ మహోన్నత నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి - తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్



**చేగుంట సెప్టెంబర్ 12 మెదక్ టుడే న్యూస్**

రైతాంగ హక్కుల కోసం, అన్నదాతల సంక్షేమం కోసం తన జీవితాన్నే ధారపోసిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు, ఆల్ ఇండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం మొత్తం వ్యవసాయ రంగానికి, రైతు ఉద్యమానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ పేర్కొ న్నారు. చేగుంట పట్టణంలోని ఇన్స్పెక్టర్ బంగ్లా (ఐబీ) లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది.

ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. తెలంగాణ నేల కన్న వీరపుత్రుడు, వ్యవసాయ రంగాన్ని తన శ్వాసగా మలుచుకున్న నాయకుడు మల్లారెడ్డి అని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, సాగునీటి ప్రాజెక్టుల కేటాయింపులు, పంట నష్టపరిహారం, కౌలు రైతులకు చట్టబద్ధ గుర్తింపు కోసం ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. చేగుంట ఉపసర్పంచ్ రఫీ రైతందానికి పాదాభివందనం చేశారు. బోయిని నరసింహులు మాట్లాడుతూ చేగుంటలో మూత్రశాలలు కావాలి అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలమణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్, రైతు సంఘం జిల్లాఉపాధ్యక్షులు అయిత దివాకర్, మహమ్మద్ రఫీ, బోయిని నర్సింహులు, జిల్లా సహాయ కార్యదర్శులు సీహెచ్ లచ్చగౌడ్, భాస్కర్, భిక్యా నాయక్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాలోజీ జయంతి వేడుకలు
### ఉత్తమ న్యాయవాదిగా చేగుంటకు చెందిన మమతకు అవార్డు



**చేగుంట సెప్టెంబర్ 12 మెదక్ టుడే న్యూస్**

వరంగల్ లో సెప్టెంబర్ 9న నిర్వహించిన కాలోజీ జయంతి ఉత్సవాల్లో చేగుంట మండలం ఎన్జీవో కాలనీకి చెందిన న్యాయవాది కొమ్ము మమతకు వైఫ్ ఆఫ్ సురేందర్ ఉత్తమ న్యాయవాది అవార్డు లభించింది. న్యాయ సేవా రంగంలో విశేష సేవలు అందిస్తున్నందుకు గాను మెదక్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ తరఫున ఆమెను ఎంపిక చేయగా, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవి దేవి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని చేగుంట పట్టణంలో ని 14వ వార్డు అడ్వకేట్ మమతకు ఉత్తమ న్యాయవాది అవార్డు రావడం సంతోషకర విషయం లోని వార్డు సభ్యులు ఆకుల సుఖేందర్ అన్నారు

## రహదారి పై తీవ్ర గాయలతో



**పాపన్నపేట, సెప్టెంబర్, 12, మెదక్ టుడే న్యూస్:**

రాత్రి వేళ రహదారిలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. కొత్తపల్లి గ్రామానికి చెందిన గుడ్డింగారి రాజు (25) ఆటో డ్రైవర్ గా పని చేస్తు జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం రాత్రి మండల పరిధి లోని శానాయిపల్లి శివారు మెదక్ - బొడ్మట్ పల్లి ప్రధాన రహదారి రోడ్డుపై తలకు గాయాలతో పడి ఉన్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజును ఎవరైనా హత్య చేసి ఉంటారా లేదా ఏదైనా వాహనం ఢీ కొట్టిందా అనేది తెలియాల్సి ఉందని ఎస్ఐ అన్నారు. మృతుడి తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా
# మౌలిక వసతుల కల్పన




- రూ. 4.06 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రక్షిత తాగునీటి సరఫరా ప్రారంభం
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వార్డును అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్లలో దాదాపు రూ. 4.06 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనను దశలవారీగా వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, దేవ్ ప్రైమ్ విల్లాస్ కాలనీలలో రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంటికీ నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, సందీప్, రామకృష్ణ, అంజాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

## గీతం వర్సిటీలో 'మైక్రోకంట్రోలర్లు యంత్ర
## అభ్యాసం'పై రెండు రోజుల కార్యశాల




**పటాన్‌చెరు, సెప్టెంబర్ 12: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థుల్లో ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం (హైదరాబాద్) కృషి చేస్తోంది. ఇందులో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ పరిధిలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన సూక్ష్మ నియంత్రకాలు (మైక్రోకంట్రోలర్లు), యంత్ర అభ్యాసం (మెషిన్ లెర్నింగ్)' అనే అంశంపై రెండు రోజుల ఆచరణాత్మక కార్యశాల విజయవంతంగా ముగిసింది. శాన్సీ ఆర్ఎఫ్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ సంస్థల సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ శిక్షణలో దాదాపు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సరికొత్త సాంకేతిక విభాగమైన 'టైనీ మెషిన్ లెర్నింగ్'పై విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. యంత్ర అభ్యాస ప్రాథమిక సూత్రాలు, సంవేదకాల అనుసంధానం (సెన్సార్ ఇంటర్‌ఫేసింగ్), సమాచార సేకరణ, నమూనాల శిక్షణ (మోడల్ ట్రైనింగ్), సూక్ష్మ నియంత్రకాలపై వాటి ప్రయోగం, ప్రత్యక్ష ఫలితాల విశ్లేషణ, పరికరాల సమన్వయం (హార్డ్‌వేర్ ఇంటిగ్రేషన్) వంటి కీలక అంశాలపై నిపుణులు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు స్వయంగా ఐదు ప్రయోగాత్మక ప్రాజెక్టులను రూపొందించి విజయవంతంగా ప్రదర్శించారు. తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాలను నిజ జీవిత సాంకేతిక అవసరాలకు అనుసంధానించడం, పొందుపరిచిన వ్యవస్థలు (ఎంబెడెడ్ సిస్టమ్స్), కృత్రిమ మేధ (ఏఐ), ఎడ్జ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో ఆచరణాత్మక నైపుణ్యాలను అలవర్చుకోవడానికి ఈ వేదిక ఎంతగానో దోహదపడింది.

విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంచేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్. ముడిమేల పేర్కొన్నారు. ఈ కార్యశాలకు కార్యక్రమ నిర్వాహకుడు, సహాయ ఆచార్యుడు ఎం.నరేష్ కుమార్, సహ నిర్వాహకుడు డాక్టర్ ఎస్.కె. జానీ భాషా సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

## చేగుంటలో మూత్రశాలలు లేక ప్రజల అవస్థలు
# ధర్నాకు సిద్ధమంటున్న గ్రామస్తులు



**చేగుంట సెప్టెంబర్ 12 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రంలో మూత్రశాలలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని భీమరావుపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బోయిని భూషణం ఆవేదన వ్యక్తం చేశారు. చేగుంట అంగడి రోజు నార్సింగి మండలంతో పాటు 50 గ్రామాల నుంచి ప్రజలు చేగుంటకు వస్తుంటారని, పురుషులు, మహిళలకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంత పెద్ద గ్రామంలో మూత్రశాలలు లేకపోవడం బాధాకరమని, తక్షణమే సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు స్పందించి మూత్ర శాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

లేకుంటే గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.

## ఓటు హక్కులో పొరపాట్లు లేకుండా చూడాలి



- మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

**పాపన్నపేట,సెప్టెంబర్,12, మెదక్ టుడే న్యూస్:** పొరపాట్లకు తావు లేకుండా అర్హులందరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ సిబ్బందికీ సూచించారు. ప్రత్యేక క్యాంపెన్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం లక్ష్మీనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం,పోలింగ్ స్టేషన్ లోని రికార్డులు,ఫారాలు పరిశీలిం చారు. ఓటర్ల తొలగింపు,చేర్పుల ప్రక్రియకు సంబంధిత ఫారం 6,7,8 ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఎన్నికల సంఘం మార్గద ర్శకాల కనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఏ ఒక్కరికీ అన్యాయం జరుగవద్దన్నారు. ఆయన వెంట తహశీల్దార్ సతీష్ కుమా ర్,ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్,సెప్టెంబర్,12,మెదక్ టుడే న్యూస్:** మెదక్:జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపయన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం,పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు (నో మ్యాపింగ్ కేసెస్) ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమంథవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ పన్నీర్‌పై నలుగురు పాత్రికేయుల పోరాటం అభినందనీయం

- టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



**హైదరాబాద్,సెప్టెంబర్,12, మెదక్ టుడే న్యూస్:** కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం నలుగురు పాత్రికేయులు గౌటి రామ కృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్ సాగిస్తున్న పోరాటం అభినందనీయమని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న పాత్రికేయులపై భౌతిక దాడులు జరుగుతున్నప్పటికీ వారికి రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగమే పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం కోసం నిజాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులను వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రాజేష్ ఖన్నా పేర్కొన్నా రు.పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన రక్షణ కల్పించాలని కోరారు.ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే కలుగజేసుకొని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి పాత్రికేయులపై నమోదైన అక్రమ కేసులను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పాత్రికేయులపై దాడి చేసిన మాఫియా సభ్యులపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ప్రజల శ్రేయస్సు కోసం నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులపై భవిష్యత్తులో దాడులు వేధింపులు జరగకుండా వారికి తగిన రక్షణ కల్పించేలా పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ప్రజారోగ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న పాత్రికేయులకు తెలంగాణ గంగపుత్ర సంఘం అండగా నిలుస్తుందని రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర స్పష్టం చేశారు.

## నేను కొన్నది భూదాన్ భూమి కాదు

## అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా

అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు తనపై చేసిన అసత్య ప్రచారాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి) ఖండించారు. వట్టినాగుల పల్లిలో తాను భూదాన్ భూమిని కొనుగోలు చేశానని వస్తున్న తప్పుడు ఆరోపణలు, కథనాలన్నీ అవాస్తమని ఆయన పేర్కొన్నారు. న్యాయ సలహా, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాకే అక్కడ భూమి తీసుకున్నానని, అది భూదాన్ భూమి కాదని పత్రికా ప్రకటనలో పల్లా స్పష్టం చేశారు.వట్టినాగులపల్లిలో తాను భూదాన్ భూమి కొనుగోలు చేశానంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తిప్పికొట్టారు. తాను కొన్నది భూదాన్ భూమి కాదని, అన్నీ సరిగ్గా ఉన్నాయని తెలిశాకే అగ్రిమెంట్ చేసుకొని.. రిజిస్ట్రేషన్ చేసుకున్నానని ఆయన ప్రకటన విడుదల చేశారు.'వట్టినాగులపల్లిలో నేను కొనుగోలు చేసింది భూదాన్ భూమి కాదు. అక్కడ నాకున్నది ఎకరం 10 గుంటలు మాత్రమే. నేను 2012లో వట్టినాగులపల్లి సర్వే నంబర్ 188/1/2లో పూర్తి వివరాలు తెలుసుకొని, న్యాయ సలహా తీసుకొని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాను. అన్నీ సవ్యంగా ఉన్నాయనే తెలిశాకే 2012లోనే అగ్రిమెంట్ చేసుకొని.. 2014లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ఈ భూమి వివరాలను 2015, 2021, 2023 ఎన్నికల అఫిడవిట్లలోనూ పొందుపరిచాను. నేను కొన్నది భూదాన్ భూమి కాదు అనడానికి సంబంధించిన పత్రాలను కూడా సమర్పించాను. ఇంకా ఎవరికైనా వివరాలు కావాలంటే ప్రభుత్వపరంగా సంబంధిత రికార్డులను వెరిఫికేషన్ చేసుకోవచ్చు నేరుగా నన్ను సంప్రదించినా పూర్తి వివరాలు తెలియజేస్తాను.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి




- మండపాల నిర్వాహకులతో పోలీసుల సమన్వయ సమావేశం
- మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- డీజేలకు అనుమతి లేదు.. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు
- సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దు: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్

**మెదక్,సెప్టెంబర్,12,మెదక్ టుడే న్యూస్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మెదక్ టౌన్, మెదక్ రూరల్ సర్కిల్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్లకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండపాల ఏర్పాటు, భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్యం, నిమజ్జనం తదితర అంశాలపై పోలీసు అధికారులు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.సమావేశంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా సోదంభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రతి గణేష్ మండపాన్ని పోలీసు శాఖ వెబసైట్‌లో నమోదు చేసుకుని అనుమతి పొందాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలూ కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. మండపాల వద్ద టపాకాయలు కాల్చరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల గకుండా మండపాలను ఏర్పాటు చేసుకో వాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని, మండపాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకు ంటామని హెచ్చరించారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఎస్పీ కోరారు. ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా అవసరమైన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్కు ఎలాంటి అంతరాయం కలగ కుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు

## క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ స్టాఫ్ రిపోర్టర్ల తొలి సమావేశం విజయవంతం




- సంస్థను మరింత బలోపేతం చేసి.. ప్రజా సమస్యలపై సంచలనాత్మక కథనాలతో దూసుకెళ్లాలి
- జిల్లాల వారీగా రిపోర్టర్ల వ్యవస్థను పటిష్టం చేయాలి
- సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలి
- (స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్,సెప్టెంబర్,12, మెదక్ టుడే న్యూస్:** రాష్ట్రవ్యాప్త విస్తరణలో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లాల స్టాఫ్ రిపోర్టర్ల తొలి సమావేశం హైదరాబాద్ రాగన్నగూడలోని క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ కార్పొరేట్ కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. సంస్థ ఎడిటర్-ఇన్-చీఫ్ ఎన్. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర స్టేట్ బ్యూరో చీఫ్ అండ్ స్పెషల్ కరస్పాండెంట్ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుతో పాటు వివిధ జిల్లాలకు చెందిన స్టాఫ్ రిపోర్టర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంస్థ భవిష్యత్ ప్రగతి, జిల్లాల వారీగా వార్తా సేకరణను విస్తృతం చేయడం, మండల స్థాయిలో రిపోర్టర్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన వార్తలను అందించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ప్రజా సమస్యలే ప్రధాన అజెండా ఎడిటర్-ఇన్-చీఫ్ ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఇంగ్లీష్ డైలీని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలమైన మీడియా సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి అంశాలు, ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలను వాస్తవాలను పరిశీలించి బాధ్యతాయుతంగా వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.పత్రిక అభివృద్ధికి సిబ్బంది, స్టాఫ్ రిపోర్టర్లు తమవంతు సహకారం అందిస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.సంచలనాత్మక కథనాలతో ముందుకు సాగాలిస్టేట్ బ్యూరో చీఫ్ అండ్ స్పెషల్ కరస్పాండెంట్ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ.. క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందేలా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని అన్నారు.జిల్లాల పరిధిలోని ప్రతి మండలంలో రిపోర్టర్లను సమీకరించి, వార్తా సేకరణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే వాస్తవాధారిత, బాధ్యతాయుతమైన, ప్రభావవంతమైన కథనాలతో క్యాపిటల్ ఇన్ఫర్మేషన్‌ను ప్రజలకు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు.

**సంస్థ అభివృద్ధికి సమష్టి సహకారం**

సమావేశంలో సంస్థ పురోగతి, నిర్వహణ అవసరాలు, వార్తా సేకరణ వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై చర్చించి, ప్రతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నెలకు రూ.3,500 వరకు యాడ్స్ రూపంలో సంస్థకు సహకారం అందించేందుకు అంగీకారం వ్యక్తం చేసినట్లు తెలిపారు.ఇది సంస్థపై బలవంతపు బాధ్యతగా కాకుండా, సంస్థ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా నిలవాలనే ఉద్దేశంతో పరస్పర అంగీకారంతో తీసుకున్న నిర్ణయంగా సమావేశంలో పేర్కొన్నారు.జిల్లాల నుంచి మండలాల వరకు పటిష్టమైన నెట్‌వర్క్ క్యాపిటల్ ఇన్ఫర్మేషన్‌ను రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి మండలానికి విస్తరించేలా స్టాఫ్ రిపోర్టర్లు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.


సమష్టి కృషి, నిబద్ధత, బాధ్యతాయుతమైన జర్నలిజంతో సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ప్రతి నిధులు సంకల్పించా రు.సమా వేశం అనం తరం సంస్థ ఎడిటర్-ఇన్-చీఫ్ ఎన్. శ్రీనివా సరావు, స్టేట్ బ్యూరో చీఫ్ అండ్ స్పెషల్ కర స్పాండెంట్ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మరియు పాల్గొన్న స్టాఫ్ రిపోర్టర్లు సంస్థ భవి ష్యత్ కార్యాచరణపై పరస్పరం అభి ప్రాయా లు పంచుకున్నారు. సమావేశం సాను కూల వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## ఫలించిన నలుగురు జర్నలిస్టుల శ్రమ

- అనలాగ్ (కల్తీ) పనీర్ కు అడ్డుకట్ట.. గెజిట్ విడుదల
- కల్తీ పన్నీర్ దందాపై వరుస కథనాలు, అధికారుల దృష్టికి అక్రమ సరఫరా కేంద్రాలు
- సికింద్రాబాద్ నుంచి తిరుమలగిరి, కుషాయిగూడ, హబ్సిగూడ, మేడిపల్లి వరకు వెలుగులోకి తెచ్చిన వ్యవహారం..
- ప్రభుత్వం స్పందించడంతో కల్తీ పన్నీర్‌పై కఠిన చర్యలు
- కల్తీ పన్నీర్ వ్యవహారంలో ప్రభుత్వం స్పందించడంపై జర్నలిస్టుల హర్షం



మహిళా జర్నలిస్టుపై దాడికి తెగపడ్డ దృశ్యం



O/o Commissioner, Telangana
Standards Authority for Food and
Essential drugs (TG SAFE)

No. 07/FSS/TG SAFE/2026 Dated: 11.09.2026

// PRESS NOTE //

Sub: Food Safety and Standards Act, 2006 – Prohibition of manufacture, processing, storage, distribution, transportation and sale of analogue /non-dairy paneer being manufactured, stored, distributed or sold as "Paneer" or otherwise – Order Notified in official gazette – Issued.

>>> <<<

It is to inform that In exercise of the powers conferred under clause (a) of Sub-section (2) of Section 30 of Food Safety and Standards Act, 2006 and in the interest of public health, Commissioner of Food Safety, Telangana State issued orders prohibiting the manufacture, processing, packing, storage, distribution and sale of non-dairy/artificial paneer/analogue paneer in any form throughout the State of Telangana for a period of one year with immediate effect from 10.09.2026. The order is notified in the official gazette bearing No 807 Dated 10.09.2026

The copy of the gazette notification is enclosed herewith. Hence, the same may be published in the Print and electronic Media for dissemination of information to the general public.

Sd/-
Commissioner
Telangana Standards Authority
for Food and Essential drugs (TG SAFE)

Copy submitted to:-

**హైదరాబాద్,సెప్టెంబర్,12, మెదక్ టుడే న్యూస్:** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పన్నీర్ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంలో నలుగురు జర్నలిస్టుల కృషి ఫలించింది. గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్‌లు కలిసి కల్తీ పన్నీర్ తయారీ, ప్యాకింగ్, సరఫరాకు సంబంధించిన పలు అంశాలను పరిశోధనాత్మక కథనాల ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చారు. పలు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ విక్రయాలు, సరఫరా తీరును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దాడులు జరిగేలా సమాచారం అందించారు.

**అధికార యంత్రాంగాన్ని కదిలించిన కథనాలు**

సికింద్రాబాద్, తిరుమలగిరి, మేడిపల్లి, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో కల్తీ పన్నీర్ విక్రయాలు, సరఫరాపై సమాచారం సేకరించిన జర్నలిస్టులు సంబంధిత పోలీసు, ఫుడ్ సేఫ్టీ అధికారులకు వివరాలు అందించినట్లు తెలిపారు. ఎక్కడ తయారు చేస్తున్నారు. ఎక్కడ ప్యాకింగ్ చేస్తున్నారు ఏ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. అనే అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా హబ్సిగూడ వీధి నంబర్ 8లో రోడ్డుపైనే పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారాన్ని కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు నలుగురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయితే సకాలంలో స్పందన లేకపోవడంతో పరిస్థితి మరింత తీవ్రమైందని కల్తీ పన్నీర్ మాఫియా సభ్యులు తమ అక్రమ దందాను అడ్డుకుంటున్నారని జర్నలిస్టులపైనే దాడులు చేశారని పేర్కొన్నారు.

**ప్రభుత్వం సీరియస్.. కల్తీకి చెక్**

కల్తీ ఆహార పదార్థాలపై వస్తున్న ఫిర్యాదులు, మీడియా కథనాల నేపథ్యంలో పోలీసు, ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లడంతో కల్తీ పన్నీర్ సరఫరాపై చర్యలు ముమ్మరమయ్యాయని పేర్కొన్నారు.

కల్తీ పన్నీర్‌పై నియంత్రణకు ప్రభుత్వం స్థాయిలో చర్యలు చేపట్టడం ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పరిణామమని గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. కల్తీ పన్నీర్ సరఫరాకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

**కల్తీని ప్రశ్నిస్తే జర్నలిస్టులపైనే కేసులా.?**

ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆ నలుగురు జర్నలిస్టులు కల్తీ ఆహారంపై వరుస కథనాలు రాయడంతో పాటు, అధికారులకు సమాచారం అందిస్తుంటే, మరోవైపు తమపైనే కేసులు నమోదు కావడం బాధాకరమని నలుగురు జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. హబ్సిగూడ వీధి నెంబర్ 8 లో కల్తీ పన్నీర్ సరఫరా, రోడ్డు పక్కన ప్యాకింగ్ జరుగు తోందన్న సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలోనే కల్తీ పన్నీర్ సరఫరాదారుల విషయాలను తీసుకువచ్చి జర్నలిస్టుల పైననే దాడులు చేయడంతో పాటు ఆర్థిక రాజకీయ బలాన్ని ఉపయోగించి తమ పై కేసులు నమోదయ్యాయని వారు పేర్కొన్నారు.కల్తీ వ్యవహారాన్ని ప్రశ్నించాల్సిన ఓయూ పోలీసులు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం పట్ల ప్రజల్లోనూ చర్చ జరుగుతోందని వారు పేర్కొన్నారు. కల్తీ పన్నీర్ మాఫియా సభ్యులు జర్నలిస్టులపై దాడి చేయడం మహిళా జర్నలిస్ట్ అని చూడకుండా ఆమెపై దాడి చేయడంతో పాటు అసభ్య పదజాలాలతో దూషించి బలవంతంగా ఫోన్ లాక్కోవడం జరిగిందని, ఆ వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో పోలీసు ఉన్నత అధికారులు సైతం ఆ వీడియోలని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. జర్నలిస్టులపైనే దాడి చేసి వారిపైనే కేసులు పెట్టించారు అంటే ఇక కల్తీ పన్నీర్ మాఫియా బలం ఎంత గట్టిగా ఉందో ఉన్నత అధికారులకే తెలియాలి. అయితే ఈ వ్యవహారంపై సంబంధిత పోలీసు అధికారుల వివరణ కూడా వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది.

**కేసులు పెట్టినా.. ప్రజా ఆరోగ్య పోరాటం ఆగదు**

కల్తీ పన్నీర్ వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవడంపై గౌటీ రామకృష్ణ, బొడికే వాణి, గంగి కృష్ణ, సతీష్ జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం తాము చేసిన కృషికి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించడం సంతోషకరమని తెలిపారు.అయితే కల్తీని వెలుగులోకి తీసుకొచ్చిన జర్నలిస్టులను అధికారులు ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు ఏర్పడటం బాధాకరమ న్నారు. పోలీసు శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు సహకరిస్తే భవిష్యతులో మరిన్ని కల్తీ ఆహార కేంద్రాలను వెలుగులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కల్తీ ఆహారంపై పోరాటం ఒక్క శాఖ బాధ్యత కాదని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మీడియా, పోలీసు, ఫుడ్ సేఫ్టీ, ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. కల్తీ దందా వెనుక ఎవరున్నా, ఎంతటి పలుకుబడి ఉన్నా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఒకే నగరం, ఒకే పరిపాలన హైదరాబాద్‌కు క్యూర్-2026 చట్టం

**హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరంలో వేర్వేరు సంస్థలు, వ్యవస్థలతో అస్తవ్యస్తంగా మారిన పరిపాలనను చక్కదిద్దడమే లక్ష్యంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)-2026 బిల్లును ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపె ట్టింది. ఒకే నగరం, ఒకే పరిపాలన, ఒకే చట్టం నినాదంతో ఈ బిల్లు రూపుదిద్దుకుంది. జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ క్యూర్? బిల్లు-2026ను ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. సీఎం ఛైర్మన్‌గా క్యూర్ పరిధికి అత్యున్నత పరిపాలన మండలి, కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, మరో పది రకాల కమిటీలు ఈ చట్టంలో ఉంటాయి. జీహెచ్ఎంసీ చట్టంలో మాదిరి పరిపాలనలో నగర పాలక సంస్థనే పరిమితం చేయకుండా పోలీసు, హైడ్రా, జలమండలి వంటి ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది.అక్రమ నిర్మాణాలపై 4 రకాల చర్యలుఅక్రమ నిర్మాణాల కట్టడికి జరిమానా, కూల్చివేత, సీజ్ చేయడం, సౌకర్యాల నిలిపివేత అనే నాలుగు రకాల




చర్యలు ఇందులో ఉంటాయి. సెక్షన్ 94 ప్రకారం అనుమతిలేని భవన నిర్మాణాలు ఉంటే ఆస్తిపన్నుపై 100 శాతం నుంచి 300 శాతం జరిమానా పడుతుంది. భవనం వినియోగాన్ని మార్చినా ఫైన్ విధిస్తారు.మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్ణయాలు, నోటీసులను 30 రోజుల్లో ప్రజలు సవాల్? చేయవచ్చు. ప్రభుత్వం క్యూర్ అప్పిలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేస్తుంది. ఛైర్‌పర్సన్, ఇద్దరి నుంచి నలుగురు పూర్తిస్థాయి సభ్యులతో సివిల్ కోర్టు అధికారాలతో ఈ అథారిటీ విధులు నిర్వహిస్తుంది. సభ్యులను ప్రభుత్వం, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శితో కూడి సెలక్షన్ కమిటీ నియమిస్తుంది. డిజిటల్ గవర్నెన్స్‌క్యూర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు ఒకే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పౌర సేవలను అందించాలని అన్నిరకాల పర్మిషన్లు, పన్ను, రుసుముల చెల్లింపునకు సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ శాఖల రుసుముల చెల్లింపు సదుపాయాన్ని కూడా క్యూర్ ఆన్?లైన్ పోర్టల్‌లో చేర్చాలన్నది ప్రతిపాదన. భవనాలకు గుర్తింపు సంఖ్యహైదరాబాద్?లోని అన్ని భవనాలకు ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్, అపార్ట్‌మెంట్ల విషయంలో ఫ్లాట్లకు సబ్ ఐడెంటిటీ కోడ్‌ను ఇవ్వాలన్నది బిల్లులోని ప్రతిపాదన. ఆయా గుర్తింపు సంఖ్యతో ప్రజలు తమ ఆస్తి వివరాలు, నీటి బిల్లు, దానికి సంబంధించిన పన్ను, కరెంటు బిల్లు, ఇతరత్రా ఛార్జీలను చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తారు. పన్నుపైనే సగం అభ్యంతరాలుక్యూర్ బిల్లుపై ప్రభుత్వం ఈ ఏడాది జులై 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించింది. ఆన్‌లైన్‌లో 4,107, ఈ-మెయిల్‌కు 400 అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో 2,465 ఫిర్యాదులు ఆస్తిపన్నును పెంచొద్దనే విషయం పైనే ఉన్నాయి. ఎంఐఎం పార్టీ నుంచి 18, బీజేపీ నుంచి ఐదు, ఎంపీ రఘునందన్‌రావు వ్యక్తిగతంగా ఆరు సూచనలు ఈ బిల్లులో చేశారు. వాటిల్లో కొన్ని సూచనలను పరిగణన లోకి తీసుకొని బిల్లులో అధికారులు మార్పులు చేశారు.నపు అధికారాలను కూడా కల్పిస్తోంది. సొంత పోలీస్? స్టేషన్? ఏర్పాటుతో కొన్ని నేరాలపై క్రిమినల్ కేసులను నమోదు చేసే అధికారం ఉంది. అగ్నిమాపక భద్రత చర్యలపై తనిఖీల నిర్వహణ, నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై తనిఖీలు, ఇతరత్రా అధికారాలు హైడ్రాకు ఉంటాయి.

# మావోయిస్టు సభ్యురాలి కోసం 'ఇంటెలిజెన్స్' ఆరా



**అక్కన్నపేట(మెదక్):** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన మావోయిస్టు దండకారణ్య సభ్యురాలు కాశబోయిన స్వరూప గురించి హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. స్వరూప బంధువులు, గ్రామస్థులను కలిసి ఆమె ఎప్పుడు పార్టీలోకి వెళ్లింది..? వెళ్లినప్పుడు నుంచి ఎప్పుడైనా ఎవరితోనైనా మాట్లాడిందా..? గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను కలిసిందా..? ఆమె గురించి ఇంకేమైనా సమాచారం మీకు తెలుసా..?బ్రతికి ఉందో.. మృతి చెందిందో అనే వివరాలను సేకరించారు. ఆమెకు చెందిన కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. స్వరూప చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించడంతో నానమ్మ,తాత దగ్గర పెరిగింది. నానమ్మ, తాత చనిపోగా ఆమె చెల్లి మాత్రమే ఉందని వివరాలను తెలుసుకున్నారు.అలాగే స్వరూప చదువుకున్న పాఠశాలలో ఆమెకు సంబంధించిన ఫోటోలు దొరుకుతాయేమోనని రికార్డులను వెతికారు. ఆమెకు సంబంధించిన వివరాలు దొరకకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. స్వరూప కేసు క్లోజ్ చేసేందుకే వారు వచ్చారని, దండకారణ్య సభ్యురాలుగా కాశబోయిన స్వరూప పనిచేస్తున్నప్పుడు ఆమెపై రెండు లక్షల రివార్డు ఉందని గతంలో పోలీసులు ప్రకటించారు. దీనికి సంబంధించి ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నారనే వివరాలు తెలుసుకునేందుకే ఇంటెలిజెన్స్ సీఐ మల్లికార్జున్ గౌడ్ బృందం వచ్చినట్లు సమాచారం.

# ర్కార్ ఖజానాలో డబ్బుల్లేవ్.. కానీ ఆ ఒక్క కంపెనీకే రూ.1400 కోట్ల కాంట్రాక్ట్



**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** కాంగ్రెస్ సర్కార్ ఖజానాలో పైసల్లేవ్ అంటూనే సామాన్య కాంట్రాక్టర్లను పట్టించుకోకుండా బడా కాంట్రాక్టర్లను వత్తాసు పలుకుతుందని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఫైర్ అయ్యారు.అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అండర్‌గ్రౌండ్ కేబులింగ్ కోసం రూ.1400 కోట్ల కాంట్రాక్ట్ ఒక్కటే కంపెనీకి తమను ఇచ్చారు. ఆ కంపెనీ చాలా లక్కీ కంపెనీ.. అన్ని కాంట్రాక్టులు ఆ కంపెనీకే దొరుకుతాయన్నారు. ఆ కంపెనీ బీజేపీకి కూడా డబ్బులు ఇస్తుంది.. అందుకే ఆ కంపెనీ పేరు చెప్పడం లేదన్నారు. ఆ కంపెనీ మాకైతే డబ్బులు ఇయ్యలేదు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, రైతుల కోసం, ప్రజల కోసం అయితే సర్కార్ ఖజానాలో డబ్బుల్లేవ్.. డబ్బులేవ్ అని అంటారు..కానీ ఆ కాంట్రాక్టర్‌కు మాత్రం బరాబర్ బిల్లులు వస్తాయి.. కరెక్ట్ టైంకి డబ్బులు ఇస్తారని ఫైర్ అయ్యారు. ఆ కంపెనీకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్ని బిల్లులు విడుదల చేశారో =×లో అడిగినా ఇవ్వడం లేదు.. నేను కోర్టుకు వెళ్లాను. రూ.1400 కోట్ల కాంట్రాక్ట్ ఆ ఒక్క పెద్ద కంపెనీకే ఇచ్చే బదులు చిన్న చిన్న కాంట్రాక్టర్లకు ఇవ్వొచ్చు కదా.. వాళ్లు కూడా బతకాలి కదా అని అన్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు.. మాక్ అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులు గణనీయంగా మారాయని అన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి శ్రీశైలం నీటిని అక్రమంగా తరలించారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో రెండు కోట్ల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దేనని జగదీశ్‌రెడ్డి అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను నింపామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు నీరు అందిందని జగదీశ్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మినహా




మిగిలిన ఉమ్మడి జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు పారాయని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాల్లో కాళేశ్వరం నీళ్లు పొంగిపొర్లాయని చెప్పారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్లోరైడ్‌ను తరిమికొట్టామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల నిర్వహణపైనా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఎడమ కాలువ గేట్లను తెరిచిన తర్వాత కుడి కాలువ గేట్లు తెరిచేవారని.. ప్రస్తుతం కుడి కాలువ గేట్లు తెరిచిన తర్వాత ఎడమ కాలువ గేట్లు తెరుస్తున్నారని అన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి వెలుగొండ ద్వారా ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నీటిని తరలించుకుపోతోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కన్నెపల్లి నుంచి వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిందని, ఇప్పటికే 150 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాగా, ఈ మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్ర పోషించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

# హైదరాబాద్ ఎమ్మెల్యేలతో సిటీ డెవలప్‌మెంట్‌పై సమావేశం ఏర్పాటు చేయండి:

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలతో సిటీ డెవలప్‌మెంట్‌పై సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై గత ముఖ్యమంత్రిని కోరిన ఆయన సమావేశం పెట్టలేదని పెదవి విరిచారు.సిటీ డెవలప్‌మెంట్‌లో ఎమ్మెల్యేలకు బాధ్యత ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.. ఎమ్మెల్యేలకే నియోజక వర్గ సమస్యలు తెలుస్తాయని అన్నారు. గ్లోబల్ సిటీ కావాలంటే ప్రతి డివిజన్ సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. సిటీలో రహదారులు చాలా వరకు డ్యామేజ్ ఉన్నాయని.. డ్రైనేజ్ సరిగా లేదు వాటి మీద కూడా దృష్టి పెట్టాల్సి ఉందని తెలిపారు. బస్తీల్లో సరఫరా అయ్యే మంచి నీటిలో డ్రైనేజ్ వాటర్ కలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ మూడు కార్పొరేషన్లు చేస్తున్నారని.. కానీ మంచి డెవలప్‌మెంట్ కావల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మూడు కార్పొరేషన్లపై చర్చ జరగాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు ఏళ్ళు పూర్తయిందని.. ఇంకా 15 నెలల సమయం ఉందని గుర్తు



చేశారు. ఈ 15 నెలల్లో మూసీ డెవలప్‌మెంట్ అవుతుందా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ వర్క్ నిదానంగా జరుగుతుందని అన్నారు. నగరంలో దోమల బెడద విపరీతంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.20 శాతం ప్రాపర్టీ టాక్స్ పెంచి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు విలువ ఉందో? లేదో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. గతంలో ఓ ఎమ్మెల్యే మీడియా ముందే అధికారులు విలువ ఇవ్వడం లేదని చెప్పారని గుర్తు చేశారు. అధికారులను రిక్వెస్ట్ చేసినా స్పందించడం లేదని ఎమ్మెల్యే రాజా సింగ్ వాపోయారు. పని చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హైదరాబాద్ గ్లోబల్ సిటీ కావాలని చాలా ఏళ్లుగా ప్రజలు కోరుతున్నారని చెప్పారు. ప్రతి సారి గ్లోబల్ సిటీ అవుతుందని అంటున్నారు కానీ అది పేపర్ల వరకే పరిమితం అవుతుందని అసహనం వ్యక్తం చేశారు. తన కల హైదరాబాద్ మంచి గ్లోబల్ సిటీ కావాలని చెప్పుకొచ్చారు. తమతో భేటీ అయి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

# బీఆర్ఎస్ నేతల భూ దందాల భాగోతం మొత్తం బయటపెడతాం



**హైదరాబాద్, సెప్టెంబర్12:** 22ఏ సమస్యకు బీఆర్ఎస్ నేతలే కారణమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. ఈ 22ఏ పై అసెంబ్లీలో మాట్లాడతానని అన్నారు. శనివారం అసెంబ్లీ వద్ద విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల భూదందాల భాగోతం మొత్తం బయటపెడతామని తెలిపారు. వాళ్ల హయాంలోనే ప్రభుత్వ భూముల్లో వెంచర్స్ చేశారని విమర్శించారు. వాటిని నిషేధిత జాబితాలో పెట్టాలని కోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు.భూబకాసురులు మేం కాదని.. గత పదేళ్ల నాయకులే దోచుకున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ నిప్పులు చెరిగారు. 22ఏ పై విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ 22ఏలో కోటి16 లక్షల ఎకరాలు ఉన్నాయనేది అబద్ధమని స్పష్టం చేశారు. 40 ఏళ్లుగా జరిగిన తప్పుల వల్లే నిషేధిత జాబితాలో భూములు ఉన్నాయని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వివరించారు.

# అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా.. సబ్‌స్టేషన్ ముట్టడి

**మహబూబ్ నగర్ :** అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం నాచహల్లి క్రిష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం సబ్‌స్టేషన్ సమీపంలో ఆందోళనకు దిగారు. వనపర్తి--పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే డీఈతో మాట్లాడించాలని రైతులు పట్టుబట్టారు. రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు 13 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. . చేశారు. ఈ ఆందోళనలో రైతులతో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కే మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధర్మనాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దేగ మహేష్ రెడ్డి, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, నారాయణ నాయక్, శంకర్ నాయక్, టికె నాయక్, సర్పంచ్ పద్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మహేష్, అంజి, రూప్ల నాయక్, గోవింద నాయక్,శివ,ఆనంద్, తులసి రామకృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు .

# బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?

**హైదరాబాద్ :** అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసు లు నమోదు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొం టామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు."ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరా బాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను



తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందర గోళం నేపథ్యంలో ముఖ్య మంత్రి తన పోలీసులతో బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు లు నమోదు చేయి ంచడం చట్టాన్ని దుం చేయడమే నని కేటీఆర్ ఆరోపించారు. 2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఆరోపించారు. "మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదు. ఇవేం పోటీలు?" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.తనకు ఎదురైన అసౌకర్యంతో మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మ్యాగీ అర్థాంతరంగా వైదొలిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్న తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..